

# పసిడిమనసులు - షర్మిల



## మిష్టరీ మావయ్య

**నేను ఎంపీసీ** గ్రూప్ తీసుకోటమే పెద్ద అరాచకం. పదో తరగతి లెక్కల్లో 37 మార్కులు వచ్చినాళ్ళని ఎవరన్నా ఎంపీసీలో చేరుస్తారా ? నలుగురికీ నచ్చినది నాకసలే నచ్చదురో టైపు నాన్న కదా !

పైగా ఆయనకి లెక్కలు రానివాళ్ళు మనుషులే కాదనే భావం బలంగా వుండటం నా ప్రాణం మీదకొచ్చింది.

అసలు మా ఊళ్ళో ఏడో తరగతి వరకూ మా మస్తాన్ వలీ మాస్టారు లెక్కల్ని రుబ్బించేవారు. అప్పుడు ఎప్పుడూ ఫస్ట్ మార్కులే !

వైజాగ్ అమ్మా నాన్న దగ్గరికి వచ్చాకా అట్టా రుబ్బుడు లేక నెమ్మదిగా వెనకపడ్డాను. ఆ పడటం పడటం మళ్ళీ లేవలేదు. లెక్కలు అనే పదం వింటే గుబులు అని వినపడటం మొదలైంది.

అట్టాంటి నన్ను ఎంపీసీ లో చేర్చే సాహసం చేశారు. నాన్న కోరిక తీర్చేసి సినిమాల్లోలా ఇంజినీర్ని అయిపోయి ఆయన ఆనందబాష్పాలు రాలుస్తుంటే తుడుచుకోవడానికి కండువా లేని మోడ్రన్ నాన్నకి కర్చీఫ్ ఇచ్చి కళ్ళు తుడుచుకోమందామని ఊహించేసుకున్నాను.

ఇంటర్మీడియట్ మేథ్స్ కి లెక్చరర్ ప్రకాశరావు మాస్టారు.

ఆయన ఒక ఏంగిల్లో ఎన్ టీ ఆర్ లాగా ఇంకో ఏంగిల్లో దాసరి నారాయణరావు లా వుండేవారు. మేం మాత్రం మా మాస్టారంటే వున్న అభిమానంతో యుగపురుషుడు అని పిలుచుకునేవాళ్ళం.అది ఎన్టీఆర్ సినిమా లెండి.

ఆయనకీ వాళ్ళకి ఒకే ఒక పోలిక బొజ్జ , చాటంత బెల్ వున్న ప్యాంట్.

ఆయన లెక్కలు చెబుతూ జుట్టు ఎగరేసి, చేత్తో సర్దుకునే స్టయిల్ ఏ హీరోకీ తీసిపోదు. క్లాస్ అయ్యే వరకూ ఆయన మేనరిజమ్స్ చూస్తే ఏ కామెడీ సినిమా చూడక్కరలేదు.

లెక్కలు కాలేజీలో కాకుండా ప్రైవేట్లో కూడా చెప్పేవారు. నేను ట్యూషన్ కి వెళ్ళేదాన్ని. పొద్దున్నే ట్యూషన్, మధ్యాహ్నం షిఫ్ట్ కాలేజీ.

పొద్దున్నే ఇంటి నుంచి ఒక కిలో మీటర్ నడిచి బస్ ఎక్కి ట్యూషన్ కి వెళ్ళేదాన్ని.

అప్పుటికే మాస్టారు ట్యూషన్ మొదలెట్టేసేవారు.నేను గ్రిల్ తలుపులు తోసుకుని గదిలోకి అడుగుపెట్టక ముందే ఆవిడ వచ్చినట్టుందోయ్ !అని చెప్పేసే వారు.

అంటే గ్రిల్ తోసే ఫోర్స్ ని బట్టి ఆయన చెప్పేసేవారు. అదే ట్యూషన్కి మిగతా మా క్లాస్మేట్స్ చాలా మంది వచ్చేవారు.

వాళ్ళల్లో పార్థు ఒకడు. పార్థు అసలు నాకోసమే ఈ కాలేజీలో చేరాడన్న పుకారు వుండేది.

అది నిజమో కాదో గానీ ట్యూషన్లో మాత్రం నాకోసమే చేరాడనేది నాకే కాదు మాస్టారికి కూడా బలమైన నమ్మకం.

అందుకే పార్థు ట్యూషన్లో అడుగుపెట్టగానే నువ్వొకడివోయ్ ! విలన్లా దాపురించావ్ !! అనేవారు.

ఆయన ఎందుకలా అంటున్నారో మిగతావాళ్ళకి తెలియకపోయినా నాకు అర్థమయ్యేది.

నేను ట్యూషన్ అయ్యాక ఇంటికి మళ్ళీ నడిచి వెళ్ళలేక మధ్యాన్నం కాలేజీకి వెళ్ళడానికి అక్కడకి దగ్గరలో వున్న మా చుట్టాల ఇంట్లో వుండేదాన్ని.

అక్కడికే అమ్మ భోజనం క్యారేజీ పంపించేది.

నేను ట్యూషన్ కి ఏ కలర్ డ్రస్ వేసుకుంటే ఆ కలర్ చూసి మధ్యాహ్నం పార్థు కాలేజీకి వస్తా ఆ కలర్ డ్రస్ వేసుకు రావడం మొదలెట్టాడు.

పొద్దున్నే నేను తెల్ల లంగా ఓణీ వేసుకెళ్తే వాడు తెల్ల డ్రస్ వేసుకుని తయారయ్యేవాడు. ఎర్ర వోణీ అయితే వాడూ ఎర్ర చొక్కా వేసుకునేవాడు.నిజానికి నేనూ దీన్ని సరదాగానే తీసుకున్నా.

కానీ అది కాలేజీలో పెద్ద చర్చగా మారిందని కొన్నాళ్ళకి గానీ తెలియలేదు.

ఒక రోజు మా వైస్ ప్రిన్సిపాల్, ఇంగ్లీష్ టీచర్ రమాదేవిగారు నన్ను క్లాస్ అయ్యాక బయటకి పిలిచారు.

"ఏంటమ్మాయ్ ! ఇదేమన్నా బాగుందా ? మీ అమ్మానాన్నకి తెలుసా !

అసలు మీ నాన్న గారిని రమ్మను మాట్లాడాలి' అని చెప్పి స్టాఫ్ రూంలోకి వెళ్ళిపోయారు.

మా నాన్నని వెంటపెట్టుకుని వెళ్ళాను.

" మీ అమ్మాయికి కొంచం చెప్పుకోండి ' అంది ఆవిడ సీరియస్ గా.

"ఇద్దరూ ఒకే డ్రస్ వేసుకుని కాలేజీకి వస్తున్నారు' అని చెప్పింది ఆవిడ.

" పొద్దున్నే మా అమ్మాయి వేసుకున్న డ్రస్ చూసి వాడు వేసుకొస్తే దీని తప్పు ఏంటో మీరే అలోచించండి ' అని నాన్న అన్నారు.

ఆ తర్వాత నాన్న ఆ సంగతే మరిచిపోయారు.

ఒక రోజు ఒళ్ళంతా దెబ్బలతో పార్థు నా దగ్గరికి వచ్చాడు.

“ ఏవండీ ! నా మీద కోపం వుంటే చెప్పొచ్చు కదండీ, ఇలా కొట్టించకపోతే” అన్నాడు దీనంగా...

"అదేంటి నేను కొట్టించానా !” అని తెల్లబోయాను.

"అవునండీ ! ఎవరో మీ మావయ్య అంట ! నా మేనకోడలి వెంట పడతావా? అని రాళ్ళు విసిరి మరీ కొట్టాడండీ బాబూ ' అని ఏడుపు మొహం పెట్టాడు.

నాకే తెలియని నా మావయ్య ఎవడోగానీ "పాపం పార్థు"!!

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments